
హ్యాపీ న్యూ ఇయర్



ఆరిలోవలో న్యూ ఇయర్ ముగ్గు వేస్తున్న యువతి



ఆరిలోవ భరత్‌నగర్‌లో ముగ్గుకు రంగులద్దుతున్న మహిళ

ఆరిలోవ: నూతన సంవత్సరం 2023కి తూర్పు నియోజకవర్గ ప్రజలు ఘన స్వాగతం పలికారు. ఆరిలోవలోని పలు ప్రాంతాల్లో ప్రజలు సందడి చేశారు. అర్ధరాత్రి 12 గంటలు దాటగానే రోడ్లపైకి చేరి ఒకరికొకరు హ్యాపీ న్యూ ఇయర్ విషెస్ చెప్పుకున్నారు. ఇళ్ల ముందు రంగురంగు రంగవల్లికలు, న్యూ ఇయర్ ముగ్గులు వేశారు. గడిచిన ఏడాది 2022కి బైబై చెబుతూ.. 2023కి గ్రాండ్‌గా వెలకమ్ పలికారు. చిన్నాపెద్దా అంతా కలిసి కేరింతలు కొడుతూ ఆటపాటల్లో మునిగితేలారు. రెట్టించిన ఉత్సాహంతో యువత ఎంజాయ్ చేశారు. కోటి ఆశలతో ప్రజలంతా కొత్త ఏడాదిని మనసారా ఆహ్వానించారు. రాత్రి మొదలు వేకువజాము వరకు ఆటపాటలతో సరదాగా.. సంతోషంగా గడిపారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్తకు అక్కరమాని పరామర్శ



పినాకిల్ ఆస్పత్రిలో మ్యాన్‌ను పరామర్శిస్తున్న అక్కరమాని విజయనిర్మల

ఆరిలోవ: ఆరిలోవకు చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త మ్యాన్ అనారోగ్యంతో ఇటీవల పినాకిల్ ఆస్పత్రిలో చేరాడు. ఆయనకు అక్కడ ఆపరేషన్ జరిగింది. విషయం తెలుసుకున్న వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్, పార్టీ తూర్పు సమన్వయకర్త అక్కరమాని విజయనిర్మల శనివారం ఆస్పత్రికి వెళ్లి మేన్‌ను పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అతడికి ధైర్యం చెప్పి రూ.10,000 నగదు అందించి ఆర్థిక సాయం చేశారు. అక్కరమాని విజయనిర్మలకు మేన్ కృతజ్ఞతలు తెలిపాడు.

డీసీఎంఎస్ విభాగాధిపతిగా ఆచార్య జాలాది రవి



ఉత్తర్వులు స్వీకరిస్తున్న ఆచార్య జాలాది రవి

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం కామర్స్ మేనేజ్‌మెంట్(డీసీఎంఎస్) విభాగాధిపతిగా ఆచార్య జాలాది రవి నియమితులయ్యారు. శనివారం ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి సమక్షంలో రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ నుంచి ఆయన ఉత్తర్వులను స్వీకరించారు. ఈ సందర్భంగా రవిని వీసీ ప్రసాదరెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. ఆచార్య రవికి విభాగ ఆచార్యులు, విద్యార్థులు, పరిశోధకులు అభినందనలు తెలిపారు. అనంతరం ఆయన విభాగంలో బాధ్యతలు స్వీకరించారు.

విమ్స్ గోడలపై ముచ్చటైన బొమ్మలు

ఆరిలోవ: విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (విమ్స్) గోడలపై జీవీఎంసీ ముచ్చటగొలిపే బొమ్మలు వేస్తోంది. బీఆర్‌టీఎస్ రోడ్డును ఆనుకుని హనుమంతవాక దరి విమ్స్ గేటు నుంచి పెదగదిలి కూడలి వరకు సుమారు ఒకటిన్నర కిలోమీటర్ల పొడవున విమ్స్ ప్రహరీ ఉంది. దీనిపై ఇంతవరకు ఎలాంటి రంగులు వేయలేదు. ఇప్పుడు జీవీఎంసీ దీనిపై దృష్టి పెట్టింది. దీంతో ఈ ప్రహరీపై బీఆర్‌టీఎస్ రోడ్డు వైపు ప్రయాణికులను ఆకట్టుకునేలా జీవీఎంసీ అధికారులు రంగురంగుల చిత్రాలు వేయిస్తున్నారు. రెండు రోజులుగా ఈ గోడపై పెయింటర్లు తమ ప్రతిభ చూపుతున్నారు. ఆధ్యాత్మికతను తెలియజేసే, ఆహ్లాదం కలిగించే చిత్రాలు, పచ్చదనం, పక్షులు, జంతువులతో కూడిన బొమ్మలు వేస్తున్నారు. దీంతో ఇవి ఈ రోడ్డులో వెళ్లే ప్రయాణికులను ఆకర్శిస్తున్నాయి.



పెదగదిలి వద్ద విమ్స్ గోడపై జీవీఎంసీ వేసిన అందమైన బొమ్మలు

ప్రయోగశాలల అభివృద్ధికి కృషి

ఏయూ ఆచార్యులకు వీసీ సూచన



కంప్యూటర్ సాఫ్ట్‌వేర్ ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న ఏయూ వీసీ ప్రసాదరెడ్డి

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయ ఆచార్యులు ప్రయోగశాలలను స్థాపించి, అభివృద్ధి చేసే విధంగా కృషి చేయాలని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి కోరారు. ఏయూ ఇంజినీరింగ్ కళాశాల కంప్యూటర్ సైన్స్ సిస్టమ్స్ ఇంజినీరింగ్ విభాగంలో ఆధునికీకరించిన సాఫ్ట్‌వేర్ లేబొరేటరీని శనివారం ఆయన ప్రారంభించారు. అనంతరం ఆచార్యులతో భేటీ అయ్యారు. కంప్యూటర్ రంగంలో పరిశోధనలు జరిపేలా విభాగంలో కొన్ని పరిశోధన కేంద్రాలను ఏర్పాటు చేయాలని సూచించారు. ఆచార్యులు తమ నిపుణత కలిగిన అంశాన్ని ఆధారంగా చేసుకుని ల్యాబ్‌లను ఏర్పాటు చేయాలన్నారు. విద్యార్థులను ఆయా రంగాల్లో నిష్ణాతులుగా తీర్చిదిద్దడానికి, వారిలో ఆసక్తి, జిజ్ఞాస కలిగించడానికి ఉపయుక్తంగా ఈ ప్రయోగశాలలు నిలవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆచార్య పేరి శ్రీనివాసరావు, కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి ఆచార్య కె.వెంకటరావు, ఐటీ విభాగాధిపతి ఆచార్య కుంజం నాగేశ్వరరావు, విభాగ ఆచార్యులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మదర్స్ లవ్ ఫౌండేషన్ రక్తదాన శిబిరం



రక్తదాన శిబిరంలో పాల్గొన్న కళాశాల విద్యార్థులు

మద్దిలపాలెం: మద్దిలపాలేనికి చెందిన మదర్స్ లవ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం సెయింట్ అలోసిస్ ఐటీఐ కళాశాలలో రక్తదాన శిబిరం నిర్వహించామని ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు డాక్టర్ ఐ.గంగాప్రియదర్శిని, అధ్యక్షుడు సుప్రజా రావొట్‌లు తెలిపారు. దాతల నుంచి 61 యూనిట్ల రక్తనిధిని సేకరించామన్నారు. తలసేమియ, క్యాన్సర్ రోగుల అవసరాలకు ఈ రక్తనిధిని ఉపయోగిస్తామని చెప్పారు. మరిన్ని రక్తదాన శిబిరాలు, సేవా కార్యక్రమాల నిర్వహణకు ప్రణాళికలు తయారు చేశామన్నారు. రక్తదాతలందరికీ వారు ధన్యవాదాలు తెలియజేశారు.

స్టేట్ డాక్టరల్ ఫోరం క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఆచార్య కృష్ణమోహన్ తదితరులు

ఎంవీపీకాలనీ: ఆంధ్రా యూనివర్సిటీలోని రిజిస్ట్రార్ కార్యాలయంలో శనివారం స్టేట్ డాక్టరల్ ఫోరం నూతన సంవత్సర క్యాలెండర్‌ను రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ స్థాయి నాణ్యతతో కూడిన పరిశోధనలు చేయాలని ఫోరం సభ్యులకు సూచించారు. సమాజ అవసరాలను తీర్చేలా పీహెచ్‌డీ విద్యార్థుల పరిశోధనలు ఉండాలన్నారు. ఆ దిశగా డాక్టరల్ ఫోరం సభ్యులు పీహెచ్‌డీ విద్యార్థుల్లో చైతన్యం పెంచాలని సూచించారు. కార్యక్రమంలో ఏయూ దూరవిద్యా కేంద్ర డైరెక్టర్ ఆచార్య విశ్వేశ్వరరావు, పాలక మండలి సభ్యురాలు ఆచార్య కృష్ణ మంజిరి పవర్, ఫోరం కో–ఆర్డినేటర్ డాక్టర్ సురేష్ మీనస్, డాక్టర్ హరి, డాక్టర్ అంబేడ్కర్, డాక్టర్ పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

నైతిక విలువలు ముఖ్యం



ఏయూ పాఠశాలలో మానవత ప్రతినిధులు

ఏయూక్యాంపస్: పాఠశాల విద్యార్థులు నైతిక విలువలు కలిగి ఉండటం ఎంతో అవసరమని మానవత స్వచ్ఛంద సేవా సంస్థ చైర్మన్ ఆచార్య ఆర్.సుదర్శనరావు అన్నారు. ఏయూ తెలుగు మాధ్యమం పాఠశాలలో శనివారం విద్యార్థులకు నైతిక విలువలు పెంపొందించడంపై ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 10 వేల మంది విద్యార్థులకు నైతిక విలువలు పెంపొందించడం లక్ష్యంగా పనిచేస్తున్నామని తెలిపారు. పాఠశాల గ్రంథాలయంలో పుస్తకాల కోసం రూ.3,000 విరాళంగా మానవత సభ్యులు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ కె.రాజశేఖర్, ఆచార్య పరమేశ్వరరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయిని సలోమి తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన కూరగాయలే విక్రయించాలి



రైతుబజార్‌లో పండ్ల నాణ్యతను పరిశీలిస్తున్న షేక్ యాసిన్

సీతమ్మధార: రైతుబజార్లలో సూచించిన ధరల మేరకు నాణ్యమైన కూరగాయలే విక్రయించాలని జిల్లా వ్యవసాయ, వాణిజ్య, మార్కెటింగ్ శాఖ అధికారి షేక్ యాసిన్ ఆదేశించారు. స్టాళ్ల డ్రా, ఇతర ఫిర్యాదులు రావడంతో విచారణ నేపథ్యంలో శనివారం సీతమ్మధార రైతుబజార్‌ను ఆయన సందర్శించారు. రైతుల స్టాళ్ల వద్దకు వెళ్లి ఐడీ కార్డులు, ఉల్లిపాయలు, టామాటాలు, పండ్ల నాణ్యతతోపాటు ధరల పట్టికలను పరిశీలించారు. సమస్యలు ఉంటే నేరుగా తన నంబర్ 7331154978కు ఫోన్ చేయాలని రైతులకు యాసిన్ సూచించారు.

రైతుబజార్ స్టాళ్లకు డ్రా..

సీతమ్మధార రైతుబజార్‌లోని స్టాళ్లకు మార్కెటింగ్ శాఖ అధికారి షేక్ యాసిన్ ఆధ్వర్యంలో డ్రా తీసి రైతులకు కేటాయించారు. ఈవో కొండబాబు, సహాయకుడు సతీష్, రైతులు పాల్గొన్నారు.

3న ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం యోగా కేంద్రం ఆధ్వర్యంలో ఈ నెల 3వ తేదీన ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు కేంద్రం గౌరవ సంచాలకులు ఆచార్య ఒ.ఎస్.ఆర్.యు.భానుకుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు బీచ్‌రోడ్డులోని యోగా కేంద్రంలో ఈ శిబిరం జరుగుతుందన్నారు. కేజీహెచ్ పూర్వ ఆయుష్ విభాగం రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ కె.ఈశ్వరరావు అవసరమైన పరీక్షలు నిర్వహించి, సూచనలు అందిస్తారని చెప్పారు. తీవ్ర అనారోగ్య సమస్యలు ఉన్న రోగులు తమ వైద్య పరీక్షల రిపోర్టులను వెంట తీసుకురావాలని సూచించారు. వివరాలకు 94401 91673, 94944 01919, 93980 19922 నంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు.

కనీస వేతనాలు చెల్లించాలని వినతి



ఏయూ రిజిస్ట్రార్ కృష్ణమోహన్‌కు వినతిపత్రం అందిస్తున్న ఉత్తరాంధ్ర విద్యార్థి సేన నాయకులు

ఏయూక్యాంపస్: ప్రైవేటు బీఈడీ కళాశాల అధ్యాపకులకు కనీస వేతనాలు ఇవ్వాలని ఉత్తరాంధ్ర విద్యార్థి సేన డిమాండ్ చేసింది. శనివారం ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్‌ను కార్యాలయంలో నాయకులు కలిసి వినతిపత్రం అందజేశారు. ఉత్తరాంధ్ర విద్యార్థి సేన వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ సుంకరి రమణమూర్తి బీఈడీ కళాశాలల అధ్యాపకులు ఎదుర్కొంటున్న సమస్యలను రిజిస్ట్రార్‌కు వివరించారు. బీఈడీ కాలేజీలు పూర్తిస్థాయిలో సీట్లు నింపుకుని, విద్యార్థుల నుంచి ఫీజుల రూపంలో కోట్ల రూపాయలు సంపాదిస్తున్నాయన్నారు. అక్కడ పనిచేస్తున్న అధ్యాపకులకు కనీసం నెలవారీ జీతాలు కూడా చెల్లించడం లేదని, ముఖ ఆధారిత హాజరు తప్పనిసరి చేసి, ర్యాటిఫికేషన్ అయిన అధ్యాపకులు మాత్రమే బోధించేలా ఆదేశాలు జారీ చేయాలన్నారు. కనీస వేతనాలు ఇవ్వని కళాశాలల యాజమాన్యాలపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. బీఈడీ కళాశాలల అధ్యాపకుల సమస్యలపై తనకు పూర్తి అవగాహన ఉందని రిజిస్ట్రార్ తెలిపారు. నెలవారీగా కనీస వేతనాలు చెల్లించాల్సిన అవసరం ఉందని, దీనిని అమలు చేయని కళాశాలలపై తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో ఉత్తరాంధ్ర విద్యార్థి సేన ఏయూ అధ్యక్షుడు ఎస్.శ్రీరామ్ చైతన్య తదితరులు పాల్గొన్నారు.

పేదలకు చీరల పంపిణీ

ఆరిలోవ: ఆరిలోవ ముస్తఫా ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం 12వ వార్డు కనకదుర్గానగర్‌లోని విశాఖ ముస్లిం మదరసలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పేద వృద్ధులకు చీరలు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథి ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు చీరలు అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్.కె.కాలేషా, కార్యదర్శి అక్బర్ అలీ, కోశాధికారి జానీ, టీడీపీ నాయకులు ఒమ్మి అప్పలరాజు, ముగడ రాజారావు, గాడి సత్యం పాల్గొన్నారు.

ముగిసిన బ్యాడ్మింటన్ టోర్నమెంట్



విజేతలకు బహుమతులు అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఆరిలోవ: జీవీఎంసీ 13వ వార్డు ముడసర్లోవ దరి మామిడి తోటలో మూడు రోజుల పాటు జరిగిన వైఎస్సార్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ శనివారంతో ముగిసింది. 30 టీంలు ఉత్సాహంగా పాల్గొన్నాయి. వాటిలో విజేతలుగా నిలిచిన జట్లకు వైఎస్సార్‌సీపీ నాయకులు అక్కరమాని వెంకటరావు, కెల్ల సత్యనారాయణ, పిల్లి వీర్రాజు, బేతా దుర్గారావు, వెంకటరెడ్డి తదితరులు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో టోర్నమెంట్ నిర్వాహకులు పాల్గొన్నారు.

వైభవంగా పాశుర విన్నపం



ముత్యాల కవచ ధారణలో వేంకటేశ్వరుడు

ఎంవీపీకాలనీ: ధనుర్మాసోత్సవాల్లో భాగంగా శనివారం ఎంవీపీ కాలనీ సెక్టార్–6లోని వేంకటేశ్వర స్వామి, ప్రసన్న ఆంజనేయ స్వామి ఆలయంలో 16వ పాశుర విన్నపాన్ని వైభవంగా నిర్వహించారు. ముత్యాల కవచ ధారణలో వెంకన్న దర్శనమిచ్చారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించి పూజలు నిర్వహించారు.

వైభవుడికి సుప్రభాత సేవ

మురళీనగర్: వైభవ వేంకటేశ్వర స్వామికి శనివారం సుప్రభాత సేవ ఘనంగా నిర్వహించారు. వేకువజామున సన్నిధి గొల్ల సేవ చేసి సుప్రభాతం చదివి వినిపించారు. ఉదయం 7.30 గంటలకు బాలభోగం, అనంతరం భక్తుల సమక్షంలో శ్రీవారికి అర్చన, మంగళాశాసనం, తీర్థప్రసాద గోష్ఠి, సామూహిక విష్ణు సహస్రనామార్చన, రాజభోగ నివేదన జరిపారు.

యూజీడీ లీకేజీతో ఇబ్బందులు



ఇసుకతోట రామాలయం వీధిలో లీకవుతున్న యూజీడీ

మద్దిలపాలెం: జీవీఎంసీ 16వ వార్డు ఇసుకతోట రామాలయం వీధిలోని నంది ఆలయం ఎదురుగా ఉన్న వీధిలో కొన్ని రోజులుగా భూగర్భ డ్రైనేజీ లీకవుతోంది. దాని నుంచి వెలువడుతున్న దుర్వాసనతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యపై ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదని వారు చెబుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి తక్షణమే మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.